క్లుప్తంగా

డీఎంహెచ్ఓ సందర్శన



వెలగవాడ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

పాలకొండ: మండలంలోని వెలగవాడ గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి(డీఎంహెచ్ఓ) జి.జగన్నాథరావు గురువారం సందర్శించారు. అక్కడి వైద్య సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించిన ఆయన రోగులకు సకాలంలో వైద్యం అందేలా చూడాలన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలన్నారు.

సెలవుల్లోగా నాడు-నేడు పనుల పూర్తి



సూచనలిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: వేసవి సెలవుల్లోగా మనబడి నాడు-నేడు పనులు పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సూచించారు. స్థానిక ఐటీడీఏ పరిధిలోని విద్యాశాఖాధికారులతో గురువారం సమావేశమైన ఆమె ప్రస్తుతం పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతం చేయాలన్నారు. వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని తెలిపారు. సకాలంలో జగనన్న విద్యాకానుక కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ జి.మురళి, గిరిజన సంక్షేమ శాఖ డీడీలు నగేష్, సూర్యనారాయణ, ఎడ్యుకేషన్ ఓఎస్డీ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



చిన్నారి ఆరోగ్యం పరిశీలిస్తున్న వైద్యాధికారి ప్రవీణ్ ప్రకాష్

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని దుడుకల్లు పీహెచ్‌సీ పరిధిలోని జోగిపురం గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి ప్రవీణ్ ప్రకాష్ పలువురికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వీలైనంత వరకు బయట తిరగవద్దని ఆయన సూచించారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



కాలువలో పూడికతీతలు చేపడుతున్న దృశ్యం

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిబద్ర గ్రామంలో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వీధులు, కాలువలను శుభ్రం చేస్తున్నారు. అనంతరం బ్లీచింగ్ చల్లి, దోమల మందు పిచికారీ చేస్తున్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు సూచించారు.

సమీకృత వ్యవసాయంపై ఒక్కరోజు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో సమీకృత వ్యవసాయంపై ఎఫ్‌పీఓ, ఐఎఫ్‌సీ డైరెక్టర్లు, సిబ్బందికి గురువారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. డీపీఎం ప్రవీణ్, ఎంపీపీ కె.దీనమయ్య మాట్లాడుతూ రైతులంతా అధిక దిగుబడుల కోసం పంట మార్పిడి చేసుకోవాలన్నారు. ప్రతిఏటా ఒకే పంట వేసుకోకుండా ఏటకో పంట వేసుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా సమీకృత వ్యవసాయం జరిగేలా గ్రామాల వారీగా కార్యాచరణ రూపొందించి, అమలు చేస్తున్నామన్నారు. నేలసారవంతానికి నవధాన్యాలు, పచ్చిరొట్ట సాగుచేయాలని తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న విత్తనాలు, ఎరువులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సల్మాన్‌రాజు, ఈఓపీఆర్‌డీ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ వెలుగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు నెలకొన్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తెట్టంగి గ్రామంలో గురువారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. ప్రజలకు ఏ కష్టం రాకూడదనే గ్రామానికి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చారన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే పథకాలు అందుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని, అటువంటి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచి చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ఎవరూ నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ అలజంగి విజయమ్మ, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పాట్నూరు లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బొరోతు రాజశేఖర్, పాట్నూరు పరిశినాయుడు, సతివాడ చిన్నంనాయుడు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



సీతంపేట: రైతులకు నవధాన్యాల కిట్లు అందజేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సీతంపేట: నవధాన్యాల సాగుతో నేలసారవంతమై, పంటలు బాగా పండుతాయని ప్రకృతి వ్యవసాయం జిల్లా యాంకర్ దేవీప్రసాద్ తెలిపారు. మండలంలోని కిండంగి గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులకు నవధాన్యాల కిట్లు గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో సూక్ష్మజీవులు, వానపాములు బాగా అభివృద్ధి చెంది, నేలకు కావాల్సిన పోషకాలు అందుతాయని, తద్వారా అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ భాను, మండల యాంకర్ బిడ్డిక నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ..



పాలకొండ రూరల్: రైతుకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: స్థానిక వ్యవసాయ కేంద్రంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు, వ్యవసాయ అధికారిణి వాహిని మాట్లాడుతూ జీలుగు, కట్టె జనుము విత్తనాలు 60 క్వింటాళ్ల చొప్పున అందుబాటులో ఉన్నాయని, వీటిని 50 శాతం రాయితీపై పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, నాగవంశపు కార్పొరేషన్ డైరెక్టర్ నల్లి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా అంగన్‌వాడీ పోస్టుల ఇంటర్వ్యూ



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అంగన్‌వాడీ పోస్టుల ఇంటర్వ్యూ గురువారం సజావుగా జరిగింది. సీతంపేట, వీరఘట్టం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న మొత్తం 11 పోస్టులకు 44 మంది దరఖాస్తు చేసుకోగా వారిని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి, పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ ఇంటర్వ్యూ చేశారు. వీరఘట్టం ఐసీడీఎస్ పరిధిలోని 3 హెల్పర్ పోస్టులకు 16 మంది, సీతంపేట ఐసీడీఎస్ పరిధిలోని 2 అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు 10 మంది, 4 హెల్పర్ పోస్టులకు 18 మంది దరఖాస్తు చేసుకున్నారని, 2 మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు ఎవరూ దరఖాస్తు చేసుకోలేదని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ జగన్నాథరావు, ఐసీడీఎస్ పీడీ విజయగౌరి, సీడీపీఓ పి.రంగలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్ఐ శివప్రసాద్

పాలకొండ రూరల్: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్ఐ బి.శివప్రసాద్ కోరారు. గురువారం స్థానిక నాగవంశపు వీధి కూడలి వద్ద దగ్గర సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టిన ఆయన అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వాహన సంబంధిత ధ్రువపత్రాలు ఉన్నవీ లేనివీ పరిశీలించారు. అనంతరం వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు దానికి సంబంధించి ధ్రువపత్రాలన్నీ వెంట తీసుకురావాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటుబెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం తాగి వాహన నడపకూడదని తెలిపారు.

క్షేత్ర సహాయకురాలిపై ఎంపీడీఓకు ఫిర్యాదు



ఎంపీడీఓకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న ఉపాధి వేతనదారులు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు క్షేత్ర సహాయకురాలిపై ఆ గ్రామ ఉపాధి హామీ వేతనదారులంతా ఎంపీడీఓ జి.పైడితల్లికి గురువారం ఫిర్యాదు చేశారు. పనులకు రాని వారికి మస్తర్లు వేస్తున్నారని, అలాగే పనులకు వచ్చిన వారికి తక్కువ వేతనం, పనులకు హాజరు కాని వారికి ఎక్కువ వేతనం వచ్చేలా కొలతలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే వేతనదారులకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. స్పందించిన ఎంపీడీఓ దర్యాప్తు చేసి, చర్యలు తీసుకుంటామన్నారు.

85 శాతం ఉత్తీర్ణత

గుమ్మలక్ష్మీపురం: డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 85 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ టి.వరం గురువారం తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యాబోధన చేయడం ద్వారానే ఈ ఫలితాలు సాధించగలిగామన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల ప్రగతిపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. మార్చి-2023లో పదో తరగతి ఉత్తీర్ణులైన ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థులంతా ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీలోగా సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. సీతంపేట బాలుర కళాశాలలో ఎంపీసీలో 40, బైపీసీలో 40, హెచ్ఈసీలో 40, ఒకేషనల్ ఎఅండ్‌టీలో 20, సీజీఏలో 30 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో 40 సీట్లు చొప్పున, ఒకేషనల్ ఎఅండ్‌టీలో 20 సీట్లు భర్తీ చేయనున్నామన్నారు. పెద్దమడిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 40 సీట్లు చొప్పున ఖాళీలున్నాయన్నారు. స్థానిక ఏపీఆర్ బాలుర కళాశాలలో జూన్ 8వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు.

22 నుంచి రిలే నిరాహార దీక్షలు

కురుపాం: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 22వ తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఏపీజీఏ సంఘ సభ్యులు కె.శంకరరావు, కె.నాగేంద్రసాయి గురువారం తెలిపారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీకే జీతాలు చెల్లించాలని, కేంద్రానికి అనుగుణంగా కరువు భత్యం ఇవ్వాలని, ఉద్యోగుల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ త్వరగా వచ్చేలా చూడాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ అమలు చేయాలని వారు కోరారు. ఈ నెల 22వ తేదీన పార్వతీపురంలో, 23వ తేదీన సాలూరులో, 24వ తేదీన కురుపాంలో, 25వ తేదీన పాలకొండలో ఈ దీక్షలు ఉంటాయన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీ శాఖాధికారులు

మక్కువ: లైఫ్ కార్యక్రమంలో భాగంగా సాలూరు అటవీ శాఖ రేంజర్ ఆదేశాలతో గురువారం మక్కువ సెక్షన్ ఆఫీసర్ కె.నారాయణరావు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పర్యావరణ హితంగా జీవనం సాగించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో దుగ్గేరు, చెక్కవలస, మడవలస గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన



జియ్యమ్మవలస: వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ రమేష్



పాలకొండ రూరల్: చినమంగళాపురంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

జియ్యమ్మవలస: మండలంలోని గెడ్డతిరువాడ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఎస్.రమేష్ గురువారం పరిశీలించారు. ఎండల తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు పాటించాలని వేతనదారులకు ఆయన సూచించారు. ఉదయం ఆరు గంటలకు, సాయంత్రం 4.30 గంటలకు చల్లగా ఉన్న సమయాల్లో మాత్రమే పనులకు రావాలని తెలిపారు. అనంతరం వడదెబ్బ బారినపడకుండా వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు.

పాలకొండ రూరల్: మండలంలోని యరకారాయపురం, చిన మంగళాపురం, బుక్కూరు గ్రామాల్లో జరుగుతన్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ డొంక త్రినాధులు గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్, టెంట్లు ఉండేలా చూసుకోవాలన్నారు. వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

కొండాపురంలో పశువిజ్ఞాన బడి



సచివాలయంలో పశువైద్య సేవల రికార్డులు పరిశీలిస్తున్న మండల పశువైద్యాధికారి సిద్ధార్థ్

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి సిద్ధార్థ్ మాట్లాడుతూ ఎండల బారినపడకుండా పశువులను సంరక్షించాలని, నీడ ప్రదేశంలో వాటిని కట్టి, సమయానికి ఆహారం అందించాలన్నారు. పశువుల ఆరోగ్యంపై అశ్రద్ధ కనబరిస్తే సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉందని, తద్వారా పాలదిగుబడి తగ్గిపోతుందన్నారు. ఈ నేపథ్యంలో పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తు టీకాలు వేయించాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో పశువైద్య సేవల రికార్డులను ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్ వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యుడు ప్రదీప్‌కుమార్

వీరఘట్టం: ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేయాలని డాక్టర్ జి.ప్రదీప్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్యారోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. మురుగు కాలువలు, దోమలు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో దోమల నివారణ మందు స్ప్రే చేయాలన్నారు. పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్య చర్యలు పక్కాగా చేపట్టాలన్నారు. ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా భావించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ వై.వెంకటరమణ, బిటివాడ పీహెచ్‌సీ వైద్యురాలు మానస తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించండి

- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి జగన్‌మోహన్‌రావు

కొమరాడ: వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. మండలంలోని కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించిన ఆయన అక్కడికి వచ్చే రోగులకు అందిస్తున్న సేవలు, రికార్డులు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ నిర్వహణపై ఆరాతీశారు. రోగి సమస్యను శ్రద్ధగా విని, అవసరమైన చికిత్స సకాలంలో అందించాలని సూచించారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం కొమరాడ పీహెచ్‌సీ పరిధిలోని సీతామాంబపురం గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనారోగ్య తీవ్రత కారణంగా వైద్య శిబిరానికి రాలేని రోగుల వద్దకు కూడా వెళ్లి, వైద్యం అందజేయాలన్నారు. రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నాయని, ప్రజలు కూడా బయటకు వెళ్లేటప్పుడు వాటర్ బాటిల్, గొడుగు వెంట తీసుకువెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యుడు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మండే ఎండలు..!



ఎండ తీవ్రతకు ముఖానికి చేయి అడ్డంపెట్టుకుని వస్తున్న వాహనదారులు

పాలకొండ రూరల్: ఎండలు మండుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గడిచిన మూడు రోజులుగా వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటుచేసుకుని, వడగాడ్పులు వీస్తున్నాయి. దీంతో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లడం లేదు. గురువారం స్థానిక పట్టణంలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ సుర్రుమంటోందని, మధ్యాహ్నం 12 గంటల నుంచి అధిక ఉష్ణోగ్రతల నమోదవుతున్నాయి. మరోవైపు ఎండల ధాటికి ప్రజల రాకపోకలు అంతంతమాత్రంగానే ఉండడంతో తమ వ్యాపారాలు బాగాలేవని తోపుడు బళ్ల వ్యాపారులు, మరికొంతమంది చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు సూచనలిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ డీడీ గయుజుద్దీన్

గరుగుబిల్లి:

చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ గయుజుద్దీన్ సూచించారు. గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలను సందర్శించిన ఆయన అక్కడి పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. సప్లిమెంటరీ పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున ఫెయిలైన విద్యార్థులంతా పాస్ అయ్యేలా చూడాలన్నారు. తొలుత పరీక్షలన్న భయం విద్యార్థుల్లో పోగొట్టాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. బాగా చదువుకుని, ధైర్యంగా పరీక్షలు రాయాలని అలా చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ఎ.రజనీకుమారి, వైస్ ప్రిన్సిపాల్ జి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో కళాకృతుల తయారీ



బొమ్మల తయారీలో నిమగ్నమైన విద్యార్థులు

పాలకొండ రూరల్: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యర్థాలతో కళాకృతుల తయారీపై గురువారం శిక్షణ ఇచ్చారు. మండలంలోని తంపటాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ జి.మురళి వ్యర్థాలతో కళాకృతులు, పేపర్‌తో బొమ్మలు తయారు చేయడం నేర్పించారు. శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామని, అందులో గెలుపొందిన వారికి ఆదివారం బహుమతులు అందజేస్తామని ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ బి.గణేష్‌బాబు తెలిపారు.